## క్లుప్తంగా

### అలరించిన సంకీర్తనలు



సంకీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

బీచ్ రోడ్డు: స్థానిక పాండురంగాపురం దేవస్థానంలో శంకర విజయేంద్ర సరస్వతిస్వామి పుట్టిన రోజు సందర్భంగా తమిళనాడుకు చెందిన జయకృష్ణ దీక్షితార్ బృందం ఆలపించిన సంకీర్తనలు అలరించాయి. భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యం పెంచాయి. ఈ కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మట్టపల్లి హనుమంతరావు, ఈవో ఎ.దేవుళ్లు పాల్గొన్నారు.

### ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు విశేష స్పందన

బీచ్ రోడ్డు: విదేశాల్లో విద్యపై అవగాహన కోసం ఎడ్మిమ్ ఎబ్రాడ్ ఎడ్యుకేషన్ గురువారం నిర్వహించిన ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. గురువారం సిరిపురంలోని ఎడ్మిమ్ కార్యాలయంలో నిర్వహించిన ఈ ఫెయిర్‌కు 50 మంది విద్యార్థులు హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారని సంస్థ డైరెక్టర్ స్నేహ తెలిపారు.

### 'కలికితురాయి గ్లోబల్ టెక్ సమ్మిట్'



గేదెల శ్రీనుబాబును అభినందిస్తున్న కర్రి వేణుమాధవ్

బీచ్ రోడ్డు: విశాఖ కీర్తి కిరీటంలో నగరంలోని ప్రారంభమైన గ్లోబల్ టెక్ సమ్మిట్ ఒక కలికితురాయి అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఢిల్లీ ఇన్‌చార్జి కర్రి వేణుమాధవ్ అన్నారు. వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో జరుగుతున్న సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు. విశాఖ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు విస్తరించే విధంగా నిర్వహిస్తున్న సమ్మిట్ కో కన్వీనర్ గేదెల శ్రీనుబాబును ఆయన అభినందించారు. పరిపాలన రాజధాని కాబోతున్న విశాఖలో ఇటువంటి సమ్మిట్లు మరిన్ని నిర్వహించాలని కోరారు.

### మహాశివరాత్రికి ఆలయాలు ముస్తాబు



పీతలవానిపాలెంలో విద్యుద్దీపాలంకరణలో శివాలయం

మద్దిలపాలెం: మహాశివరాత్రికి శివాలయాలు ముస్తాబవుతున్నాయి. విద్యుద్దీపాలంకరణలతో కళకళలాడుతున్నాయి. శనివారం మహాశివరాత్రి కావడంతో వేకువజాము నుంచి విశేష పూజలు చేయనున్నారు. అందుకు అనుగుణంగా ఆలయాలను సిద్ధం చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేస్తున్నారు. జాగరణలో భాగంగా అర్ధరాత్రి వరకూ ప్రత్యేక పూజలు చేయనున్నారు.

- పీతలవానిపాలెంలోని రామలింగేశ్వరాలయంలో శనివారం రాత్రి 9 గంటల నుంచి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించనున్నామని ఆలయ అర్చకుడు మురళీశర్మ తెలిపారు. రుద్రాభిషేకంలో పాల్గొనేవారు తమ పేర్లను ముందుగా ఆలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

# వావ్.. కర్రల క్యాంటీన్

- కంబాల కొండలో అందంగా ఆధునికీకరణ
- గడ్డితో ఆర్చ్, టేబుళ్లు, కుర్చీల ఏర్పాటు



కర్రల కుర్చీలు, టేబుళ్లు





కంబాలకొండలో కర్రలు, గడ్డితో నిర్మించిన క్యాంటీన్

ఆరిలోవ: కంబాల కొండ ఏకో టూరిజం పార్కులో శిథిలావస్థకు చేరిన క్యాంటీన్ ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. కర్రలు, గడ్డితో ఆర్చ్, టేబుళ్లు, కుర్చీలు నిర్మించి కొత్త శోభను తీసుకొస్తున్నారు. ఈ పార్కును అటవీశాఖ అధికారులు నిర్వహిస్తున్నారు. ఇది పిక్నిక్‌లకు నిలయంగా మారింది. కార్తీక మాసంలో నిత్యం ఇక్కడ వన భోజనాలతో కళకళలాడుతుంది. మిగతా రోజుల్లో సైతం పలు యూనియన్లు, సామాజిక వర్గాల సమావేశాలు జరుపుతుంటారు. దీంతో ఈ పార్కుకు నిత్యం సందర్శకుల తాకిడి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇక్కడ గతంలో అటవీశాఖ అధికారులు నిర్మించిన క్యాంటీన్ ఇటీవల శిథిలమైంది. దీంతో మళ్లీ ఇక్కడ క్యాంటీన్ నిర్మాణం తలపెట్టారు. వెదురు, అకేసియా కర్రలు ఉపయోగించి పైకప్పు గడ్డి వేసి నిర్మించిన ఈ క్యాంటీన్ సందర్శకులను ఆకర్షిస్తోంది. ఆవరణలో కూడా వెదురు, అకేసియా కర్రలతో తయారు చేసిన కుర్చీలు, టేబుళ్లు అబ్బురపరుస్తున్నాయి. రెండు చోట్ల కర్రలతో మంచెలు నిర్మించి, వీటి పైకి వెళ్లడానికి కర్రలతో మెట్లు నిర్మించారు. సిమెంట్, కాంక్రీట్ ఉపయోగించకుండా ప్రత్యేకంగా కర్రలతో ఏర్పాటు చేయడం విశేషం. వీటికి రంగులు కూడా వేయనున్నట్టు కంబాలకొండ నిర్వాహకులు తెలిపారు.



కర్రలతో నిర్మిస్తున్న ఆర్చ్

## ఎన్‌ఏడీ కూడలిలో దేవరాయల విగ్రహం ఏర్పాటుకు కృషి



శ్రీకృష్ణ దేవరాయల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

బీచ్ రోడ్డు: శ్రీకృష్ణ దేవరాయల విగ్రహాన్ని ఎన్‌ఏడీ కూడలిలో ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని నగర డిప్యూటీ మేయర్ శ్రీధర్ హామీ ఇచ్చారు. శ్రీకృష్ణ దేవరాయల 552వ జయంతి వేడుకలను శ్రీకృష్ణదేవరాయ కళా పీఠం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. బీచ్ రోడ్డులోని దేవరాయల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ కళలు, కళాకారులను పోషించిన మహనీయుడు కృష్ణదేవరాయలు అని కొనియాడారు. దేశ భాషలందు తెలుగు లెస్స అనే పలుకులతో చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో కళా పీఠం అధ్యక్షుడు ఎన్.ఆర్.గంటా, ఎం.సురేష్ బాబు, ఉషాకిరణ్, చెన్నా తిరుమలరావు, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటకులతో మర్యాదగా మెలగాలి



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావు

బీచ్ రోడ్డు: నగరానికి వచ్చిన పర్యాటకులతో ఆటో డ్రైవర్లు మర్యాదగా మెలగాలని మూడో పట్టణ ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావు సూచించారు. గురువారం బీచ్ రోడ్డులో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మంచి ప్రవర్తనతో మెలిగితే విశాఖ నగరానికి పర్యాటకుల తాకిడి పెరుగుతుందని, దీని ద్వారా ఆటోలకు డిమాండ్ ఏర్పడుతుందన్నారు. బీచ్ రోడ్డులో ఆటో స్టాండ్ ఏర్పాటు చేసుకుంటే పర్యాటకులు నేరుగా వచ్చి బుక్ చేసుకుంటారని చెప్పారు. విశాఖ పర్యాటక అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

# సినిమా షూటింగ్ సందడి

**గోపాలపట్నం రైతుబజార్‌లో పరిచయ సన్నివేశాల చిత్రీకరణ**



గోపాలపట్నం రైతుబజార్‌లో హీరోయిన్ అయేషాపై సన్నివేశం చిత్రీకరిస్తున్న దృశ్యం

గోపాలపట్నం: గోపాలపట్నం రైతుబజార్‌లో గురువారం సినిమా షూటింగ్‌తో సందడి నెలకొంది. ఉదయం 8.30 గంటలకు మొదలైన షూటింగ్ సాయంత్రం వరకు కొనసాగింది. హీరోగా సీనియర్ నటుడు బ్రహ్మాజీ కొడుకు సంజయ్ రావు(ఓ పిట్ట కథ ఫేమ్), హీరోయిన్‌గా ముంబైకి చెందిన అయేషాల మధ్య పరిచయ సన్నివేశాలను చిత్రీకరించారు. రైతుబజార్‌లో హీరోయిన్ కూరగాయలు కొనడం.. హీరో కోసం వెతుకుతుండటం వంటి సన్నివేశాలను షూట్ చేశారు. ఈ షూటింగ్‌ను చూసేందుకు వినియోగదారులు, రైతులు ఎగబడ్డారు. కొంత మంది బజారు చేయకుండా ఖాళీ సంచులతో అక్కడే నిలబడి ఆసక్తిగా తిలకించారు. డాస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ బ్యానర్‌పై నిర్మాత లివింగ్ స్టన్ నిర్మిస్తున్న ఈ సినిమాకు మణిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు.

## మాక్ పోలింగ్‌తో ఎన్నికలపై అవగాహన



మాక్ పోలింగ్‌ను పరిశీలిస్తున్న హెచ్‌ఎం హెప్సిబా, ఉపాధ్యాయులు

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు గురువారం మాక్ పోలింగ్ నిర్వహించారు. సాధారణ ఎన్నికల నియమావళిని అనుసరిస్తూ ఓటర్ల నమోదు, నామినేషన్ల దాఖలు, ఉపసంహరణ, ఓటింగ్, కౌంటింగ్, విజేతలను ప్రకటించడం వంటి ప్రక్రియలను విద్యార్థులకు అర్థమయ్యేలా జరిపారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్తేర్ హెప్సిబా ఆధ్వర్యంలో సోషల్ ఉపాధ్యాయిని కోమలి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ మాక్ పోలింగ్ వల్ల భారత దేశ ఎన్నికల ప్రక్రియపై విద్యార్థుల్లో అవగాహన వస్తుందని హెచ్‌ఎం హెప్సిబా అన్నారు.

## శ్రావ్యంగా గాత్ర కచేరి




కీర్తనలు ఆలపిస్తున్న కృష్ణమూర్తి

మద్దిలపాలెం: స్థానిక కళాభారతి ఆడిటోరియంలో గురువారం విద్వాన్ ప్రాత కృష్ణమూర్తి గాత్ర సంగీత కచేరి శ్రావ్యంగా సాగింది. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ప్రతినిధులు డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్, లలిత చంద్రశేఖర్ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కృష్ణమూర్తి చక్కగా కీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా కళాభారతి ప్రతినిధి గుమ్ములూరి రాంబాబు మాట్లాడుతూ ఈ నెల 23న రామదాసు జయంతిని పురస్కరించుకుని 200 మంది కళాకారులతో నవరత్నాల ఘోష్టిగానం నిర్వహించనున్నామన్నారు.

# విభజన హామీలను విస్మరించిన కేంద్రం

**ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ జేఏసీ కన్వీనర్ ప్రియాంక**



735వ రోజు ఉక్కుదీక్షలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ జేఏసీ కన్వీనర్ ప్రియాంక

కూర్మన్నపాలెం: ఆంధ్రప్రదేశ్‌కు దశాబ్దాలుగా పదే పదే అన్యాయం జరుగుతూనే ఉందని ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ జేఏసీ కన్వీనర్ ప్రియాంక దండి ఆరోపించారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు 735వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో దీక్షకు మద్దతుగా ఓబీసీ సంఘం అధ్యక్షుడు అప్పారావు, జనరల్ సెక్రటరీ ముసిరి శ్రీను, ట్రెజరర్ యు.శ్రీను, పండూరి కుమారితో పాటు ప్రియాంక హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ, గంధం వెంకటరావు, కారు రమణ, జి గణపతిరెడ్డి, గుమ్మడి నరేంద్ర పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించారు. అనంతరం ప్రియాంక మాట్లాడుతూ విభజన హామీలను విస్మరించి రాష్ట్రంలో అతిపెద్ద పరిశ్రమగా ఎదిగిన విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నించడం అన్యాయమన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమల్ని సర్వనాశనం చేయడానికే కేంద్ర ప్రభుత్వం చూస్తోందని ఆక్షేపించారు. ఈ ప్రయత్నాలను సంస్థలోని కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కోవాలని సూచించారు. దేశంలోని సంపదను ప్రైవేట్ వ్యక్తులకు దొచిపెట్టే హక్కు కేంద్రానికి లేదన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఉద్యమంలో కార్మికులతో పాటు ప్రజలందరినీ భాగస్వాముల్ని చేస్తూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు కె.రాజబాబు, జి.ఆర్.కె.నాయుడు, చిత్రాడ సన్యాసిరావు, కార్మికులు పాల్గొన్నారు.

## వైభవంగా రాట మహోత్సవం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలోని శ్రీ కోదండ రామాలయం, శిర్డీ సాయి సహిత గణపతి పశుపతి నాథేశ్వరస్వామి దేవాలయంలో శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం కల్యాణ రాట మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం స్వామి వారి నిత్య అర్చన, శనివారం మహాశివరాత్రి సందర్భంగా స్వామికి ఏకవార అభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సాయంత్రం అత్యంత వైభవంగా శ్రీ పార్వతి పరమేశ్వరుల కల్యాణం నిర్వహించనున్నట్లు అర్చకులు సుసరాపు రామకృష్ణ శర్మ తెలిపారు.

## ఆటో బోల్తాపడి ఒకరు దుర్మరణం

తగరపువలస: ఆనందపురం మండలం బోని గ్రామానికి చెందిన కనకల రాంబాబు(46) అనే వ్యక్తి పద్మనాభం మండలం రేవిడి సమీపాన యానాద్రి చెరువు వద్ద ఆటో బోల్తా పడిన సంఘటనలో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. రాంబాబు రోజూ బోని నుంచి పద్మనాభం మండలం రేవిడికి సైకిల్‌పై వస్తాడు. అక్కడి నుంచి ఆటోలో తగరపువలస వెళ్లి టీ దుకాణంలో పనిచేస్తాడు. అదేవిధంగా బుధవారం ఆటోలో వెళ్తుండగా డ్రైవర్ కొయ్య గౌరి అజాగ్రత్త, అతివేగానికితోడు కుక్కలు అడ్డురావడంతో సడన్ బ్రేకులు వేయగా బోల్తాపడింది. ఈ ప్రమాదంలో రాంబాబు నేలమీద పడిపోవడంతో గాయాలయ్యాయి. వెంటనే రేవిడి పీహెచ్‌సీకి తరలించగా మృతి చెందాడు. మృతుని భార్య కామేశ్వరి ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ నక్కా శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారు. బొట్ట బంగారి అనే మహిళ నుదిటిపై గాయాలు కాగా 108లో విజయనగరం మహారాజా ఆస్పత్రికి తరలించారు.

## శిల్పారామంలో చేనేత వస్త్రాల మేళా ప్రారంభం



శిల్పారామంలో చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న విశ్వనాథరెడ్డి తదితరులు

పీఎం పాలెం: చేనేత కళాకారులను ప్రోత్సహించి, వారి ఆర్థికాభివృద్ధికి సహకారం అందించాలని శిల్పారామం పరిపాలన అధికారి విశ్వనాథరెడ్డి కోరారు. చేనేత ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాల మేళాను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేళాలో సుమారు 50 స్టాల్స్ ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేరు పొందిన చేనేత ఉత్పత్తులు ఈ స్టాల్స్‌లో లభిస్తాయని తెలిపారు. స్టాల్స్ నిర్వాహకుడు బి.సురేష్ మాట్లాడుతూ తక్కువ లాభాలతో చేనేత వస్త్రాలు విక్రయిస్తున్నామన్నారు. నాణ్యమైన జంబుఖానాలు, కార్పెట్లు, అన్నిరకాల చేనేత వస్త్రాలు ప్రదర్శనలో ఉంచామని తెలిపారు.

## విద్యార్థులు బహుముఖ ప్రజ్ఞావంతులు కావాలి



సదస్సును ప్రారంభిస్తున్న ఆచార్య కిషోర్‌బాబు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు బహుముఖ ప్రజ్ఞా వంతులుగా మారాలని ఏయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు ఆశాభావం వ్యక్తం చేశారు. శివాజీపాలెంలోని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏస్పెక్ట్రా 2కే23ని ఆయన ప్రారంభించారు. అనంతరం సదస్సు ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ప్రతి సంవత్సరం విభాగం ఆధ్వర్యంలో సాంకేతిక, సాంస్కృతిక సమ్మేళనాన్ని నిర్వహించడం వల్ల విద్యార్థులను అన్ని రంగాలలో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడం సాధ్యపడుతుందన్నారు. మహిళా ఇంజినీరింగ్ కళాశాల క్రమశిక్షణకు, ప్రతిభకు నెలవన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.కె.భట్టి మాట్లాడుతూ విద్యార్థులు నిర్వాహకులుగా నిర్వహిస్తున్న ఏస్పెక్ట్రా 2కే3లో ఆర్ట్ ఎగ్జిబిషన్, నృత్య ప్రదర్శనలు, క్రీడలు, సాంకేతిక క్విజ్, టెక్ ఎక్స్‌పో, రంగోలీ వంటి పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ ఎస్.అరుణ, ఎస్.రమాదేవి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో శుక్రవారం పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. 33/11 కేవీ ఆరిలోవ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ హనుమంతవాక, 11 కేవీ ఆరిలోవ, 11కేవీ టీఐసీ పాయింట్, 11 కేవీ బాలాజీనగర్, 11 కేవీ దుర్గానగర్, 11 కేవీ శ్రీకృష్ణాపురం, 11 కేవీ పైనాపిల్ కాలనీ ఫీడర్లలో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ఫీడర్ల పరిధిలో ఆరిలోవ కాలనీ, ఆరిలోవ ఆఖరి బస్‌స్టాప్, ఆపరేషన్ కాలనీ, పాండురంగాపురం, కనకమహాలక్ష్మీనగర్, దుర్గాబజార్, లక్ష్మీనగర్, శ్రీకాంత్‌నగర్, సుందరయ్యనగర్, లీలాసుందరినగర్, నెహ్రూనగర్, టీఐసీ పాయింట్, అంబేద్కర్‌నగర్, బాలాజీనగర్, తోటగరువు, గాంధీనగర్, కైలాసనగర్, పెదగదిలి, సిద్ధార్థ బీసీ కాలనీ, రాజీవ్‌నగర్, సాలిపేట, చినగదిలి, సంతపాలెం, దీన్‌దయాల్‌పురం, వాణిజ్య పన్నులు కార్యాలయం ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

**విశాలాక్షినగర్‌లో..**

33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధి విమ్స్ 11 కేవీ ఫీడర్‌లో జరగనున్న విద్యుత్ మరమ్మతుల సందర్భంగా పలు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ తెలిపారు. విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, హనుమంతవాక కొండవాలు, ఇందిరానగర్, ఆదర్శనగర్, రవీంద్రనగర్, బీఎస్‌ఆర్ నగర్ ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

**ఎంవీపీ కాలనీ సెక్టార్-1లో..**

ఎంవీపీ కాలనీ: ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని ఎంవీపీ సెక్టార్-1, పెట్రోల్ బంక్, సాయిబాబా ఆలయం చుట్టు పక్కల ప్రాంతంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఎంవీపీ కాలనీ సెక్టార్-1లోని 11 కేవీ ఫీడర్ నిర్వహణ సర్వీసుల్లో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

## రెడ్‌క్రాస్ కేంద్రంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం




కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ శ్రీను

ఎంవీపీ కాలనీ: విశాఖ ఐ హాస్పటల్ సహకారంతో 17వ వార్డు పెదవాల్తేర్‌లోని రెడ్‌క్రాస్ సొసైటీ నిరాశ్రయుల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఎంవీపీ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ శ్రీను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యుల సహకారం కోల్పోయిన నిరాశ్రయులకు రెడ్‌క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. ఆహారం, వైద్యం, మౌలిక వసతుల కల్పనకు సమాజ సేవకులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. ఈ శిబిరంలో కేంద్రంలోని 30 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జైబీమ్ సంస్థ కన్వీనర్ కోనా ప్రకాష్ , ఏవైఏ సంస్థ సభ్యుడు కోన పరమేశ్వరరావు, రెడ్‌క్రాస్ సొసైటీ పీఆర్‌వో రావు, కేంద్రం మేనేజర్ మురళీ, ఐ హాస్పటల్ ప్రతినిధులు సాయికృష్ణ, శ్రీను, లక్ష్మి, భావన పాల్గొన్నారు.

## వీఎంఆర్‌డీఏ పెన్షనర్లకు అవగాహన



అవగాహన సదస్సులో పాల్గొన్న వీఎంఆర్‌డీఏ జేసీ వి.రవీంద్ర, కార్యదర్శి వేణుగోపాల్

మహారాణిపేట: లైఫ్ సర్టిఫికెట్, ఆదాయపు పన్ను రిటర్న్స్ దాఖలుపై వీఎంఆర్‌డీఏ విశ్రాంత ఉద్యోగులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. సంస్థ 3వ అంతస్థులో జరిగిన ఈ అవగాహన సదస్సులో విశ్రాంత ఉద్యోగుల లైఫ్ సర్టిఫికెట్ ధ్రువీకరించి వివరాలు పొందుపరిచారు. వార్షిక ఆదాయం రూ.5.50 లక్షలు దాటిన వారికి ఐటీ రిటర్న్స్ దాఖలు గురించి తెలియజేశారు. 73 మంది విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ నిబంధనలపై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ఎస్‌బీఐ మహారాణిపేట బ్రాంచి సహకారంతో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. పెన్షనర్లకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఇప్పటి వరకు లైఫ్ సర్టిఫికెట్, ఆదాయపు పన్ను రిటర్న్స్ దాఖలు చేయలేని విశ్రాంత ఉద్యోగులకు చివరి అవకాశంగా ఈ నెల 28వ తేదీలోపు అందజేయాలని, లేని పక్షంలో పెన్షన్ నిలిపివేస్తామని ముఖ్య గణాంక అధికారి జి.నిర్మలమ్మ తెలిపారు. ఈ సదస్సులో వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ వి.రవీంద్ర, కార్యదర్శి టి.వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వెంకాయమ్మ పరస



జనంతో కిటకిటలాడుతున్న పరస

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని పెదగంట్యాడలో గంట్యాడ వెంకాయమ్మ పరసను గురువారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు గంట్యాడ గోవిందరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు సందడి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎస్సీ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ఉర్రూతలూగించింది. పెదగంట్యాడలోని రేలా రే రేలా కార్యక్రమం ఆకట్టుకుంది. పరస కార్యక్రమంలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

## సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చన సేవలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం ఘనంగా సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే త్రికాల పంచామృతాభిషేక సేవలోనూ పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.